క్లుప్తంగా

గురునానక్ జయంతి వేడుకలు ప్రారంభం



గురుద్వారాలో గీతాలు ఆలపిస్తున్న సిక్కు సోదరులు

సీతమ్మధార : సిక్కుల గురువు గురునానక్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురుద్వార్ జంక్షన్‌లోని సత్సంగ్ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురుద్వారా సాద్ సంగత్ అధ్యక్షుడు డీఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో పార్థనలు చేశారు. గురు గ్రంథ్ సాహిబ్‌ని పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకలు ఈ నెల 15 వరకు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో సిక్కు సోదరులు పాల్గొన్నారు.

శిథిలమైన బ్రిడ్జి పరిశీలన



శిథిలమైన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఏఈ రమణమ్మ

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డులో గోశీలపాలెం వెళ్లే మార్గంలో కర్రివాని గెడ్డపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని సివిల్ ఏఈ రమణమ్మ, ఎలక్ట్రికల్ ఏఈ, ఇతర సిబ్బంది, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ బుధవారం పరిశీలించారు. శిథిలమైన పాత బ్రిడ్జి తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించాలని నిర్ణయించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.53 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

భారీ వాహనాలతో అవస్థలు



బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో రోడ్డు మీద నిలిపిన భారీ వాహనం



రాత్రి వేళ కూడా రద్దీగా ఉన్న బాలయ్య శాస్త్రి లే అవుట్ జంక్షన్

వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార, బాలయ్య శాస్త్రి లే అవుట్, ఇతర ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలతో ఇతర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో నిత్యం జన సంచారం అధికంగా ఉంటుంది. కీలకమైన ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వాహనదారులు, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో భవనాలు నిర్మించే కాంట్రాక్టర్లు తీసుకొచ్చే భారీ వాహనాలను వారికి నచ్చినచోటే నిలిపేస్తున్నారు. ఇటుక, ఇసుక, కాంక్రీట్ తీసుకుని నిత్యం భారీ వాహనాలు ఈ ప్రాంతంలోకి వస్తున్నాయి. ఇరుకుగా ఉండే ప్రాంతాల్లోకి సైతం మెటీరియల్ తీసుకుని భారీ వాహనాలు రావడంతో ఇతర వాహనాల రాకపోకలకు సమస్యలు ఎదురవుతున్నాయి. బాలయ్యశాస్త్రి లే అవుట్ ప్రాంతంలో భారీ భవనం నిర్మిస్తున్న కాంట్రాక్టర్ రాత్రి, పగలు తేడా లేకుండా పనులు చేస్తున్నారు. అక్కడకు మెటీరియల్ తీసుకొచ్చే భారీ వాహనాలు సైతం రోడ్డుపైనే తిష్ట వేయడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడి నాలుగు రోడ్ల జంక్షన్ మలుపు వద్దనే కాంక్రీట్ మిక్సర్ భారీ వాహనాలు రోజుల తరబడి నిలిపి ఉంచుతున్నారు. ఫలితంగా మలుపు తిరిగే వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి, పోర్టు స్టేడియం ఈస్ట్ గేటు, సీతమ్మధార కూడలి నుంచి వచ్చే వాహనాలు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. ఇటువంటి రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరగకముందే ద్వారకా పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి భారీ వాహనాలు రోడ్డు మీద నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి

రోడ్లపై ఇష్టారాజ్యంగా భారీ వాహనాలు నిలిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలి. పగలు, రాత్రి భారీ వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి పూట వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో భయాందోళన చెందుతున్నాం. ఇరుకు ప్రాంతాల్లోకి భారీ వాహనాలను అనుమతించొద్దు.

– బి.ఢిల్లీశ్వరరావు, సీతమ్మధార

భారీ వాహనాలను అనుమతించొద్దు

ప్రధాన రహదారులపైనే పెద్ద వాహనాలు నిలిపివేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. బాలయ్య శాస్త్రి లే అవుట్ రోడ్డులో స్కూల్ బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. మధ్యలో భారీ వాహనాలు రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పోలీసులు, జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సింహాచలం, బాలయ్య శాస్త్రి లే అవుట్

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్

సీతంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ కోరారు. రామాటాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరానికి సంబంధించి ఎస్సీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.48 వేల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా రూ.18,497 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఎస్టీ సంక్షేమానికి రూ.21 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.7,557 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ప్రభుత్వం పునరాలోచించి దళితులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 28 పథకాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు, మాటూరి శ్రీనివాసరావు, పతివాడ రాంబాబు, అప్పలకొండ, రాజాన సరస్వతి పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, తదితరులు

కంచరపాలెం : ఇటీవల సంభవించిన వరదలతో తీవ్రంగా నష్టపోయిన విజయవాడ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ 46వ వార్డు నుంచి వెళ్లి విశేష సేవలందించిన పారిశుధ్య సిబ్బందికి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం దుస్తులు అందజేశారు. అనంతరం శాంతినగర్‌లో గల వార్డు శానిటరీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అందించిన సేవలు ఎంతో అభినందనీయమన్నారు. విజయవాడ వరదల నేపథ్యంలో అక్కడి వరద బీభత్సం కారణంగా ఏర్పడిన వ్యర్థాలను తొలగించి ప్రజల జీవనాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి సిబ్బంది ఎంతగానో శ్రమించారన్నారు. కార్మికుల సేవలకు సత్కారంగా జీవీఎంసీ నిధులతో ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులు అందజేశామన్నారు.

కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.అప్పారావు, కె.చిన్న, సోమునాయుడు, సచివాలయ సెక్రటరీ రాజా రమేష్, వార్డు సూపర్‌వైజర్ ఎస్.రామారావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు నెహ్రూ హైస్కూల్‌కు పీడీ

సాక్షి ఎఫెక్ట్..



ఎన్‌ఎంసీహెచ్ మైదానంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

సీతమ్మధార : నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్)కి ఎట్టకేలకు ఫిజికల్ డైరెక్టర్‌ను నియమించారు. 'పీడీ లేకుండానే ఆటలు...' శీర్షికతో 'సాక్షి'లో ఇటీవల ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఫిజికల్ డైరెక్టర్‌గా గుప్తా నీరజ విధుల్లో చేశారు. మల్కాపురం దరి గాంధీగ్రామ్ పాఠశాల నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలంటే నిపుణులైన పీడీలు ఎంతో అవసరం. అలాంటిది 918 మంది హైస్కూల్, 57 మంది ఇంటర్ విద్యార్థులున్న ఈ హైస్కూల్‌లో ఏడాది కాలంగా పీడీ లేకపోవడం గమనార్హం. ఎట్టకేలకు సాక్షి' కథనంతో స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు పీడీని నియమించడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి పాఠశాల విద్యార్థులు క్రీడల్లో విశేష నైపుణ్యం ప్రదర్శిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాల ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న లైబ్రేరియన్ పద్మజ, తదితరులు

మురళీనగర్ : మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వై.పద్మజ తెలిపారు. ఈ మేరకు పాఠకులు, విద్యార్థులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిపి వారోత్సవాల ఆహ్వాన పత్రాలను బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారం రోజులపాటు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం జాతీయ పతాకావిష్కరణ, నెహ్రూ జయంతి, 15న చిత్రలేఖన పోటీలు, 16న వ్యాసరచన పోటీలు, 17న గ్రంథాలయ సభ్యత్వాల సేకరణ, 18న పాటల పోటీలు, 19న ఇందిరా గాంధీ జయంతి, మ్యూజికల్ చైర్ పోటీలు, 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. పాఠకులు, విద్యార్థులు, సభ్యులు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆమె కోరారు.

శివనగర్ రోడ్డులో మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మ్యాన్‌హోల్ చుట్టూ తారుతో పూడ్చిన దృశ్యం

మర్రిపాలెం : జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు శివనగర్ రోడ్డులోని గుంతలు, మ్యాన్‌హోల్స్ పూడ్చారు. ఇంటి ముందు గోతులు, రోడ్డు మధ్యలోని మ్యాన్‌హోల్స్ చుట్టూ గుంతలు పడడం, కరాస నుంచి శివనగర్ వైపు రోడ్డులో ఉన్న మలుపులో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 'అధ్వాన రోడ్లతో అవస్థలు' శీర్షికతో 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గుంతలు పూడ్చి, రోడ్డు బాగు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం దేవేంద్రనగర్‌లో గల బీఎస్‌ఆర్ భవనంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, రోటరీ క్లబ్, బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. కంచరపాలెం జోన్‌కు సంబంధించిన విద్యార్థులకు పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం నిర్వహించే చిల్డ్రన్స్ డే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని జోన్ కన్వీనర్ జి.వి.కృష్ణారావు తెలిపారు.

16న సామూహిక హనుమాన్ చాలీసా భజన

మురళీనగర్ : మురళీగర్ సమీపంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఆడిటోరియంలో పూర్వాంచల్ కీర్తన భజన్ మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా భజన రూపంలో శనివారం సాయంత్రం నిర్వహిస్తామని ఈస్ట్ పార్కు అధ్యక్షుడు బి.మురళీకృష్ణ తెలిపారు. మురళీనగర్, మాధవధార కాలనీల వాసులు, వాకర్స్ పాల్గొనాలని ఆయన కోరారు.

ధరల పెరుగుదలతో ప్రజలపై భారం



గొల్లకంచరపాలెం సచివాలయం వద్ద ధర్నాలో సీపీఎం నాయకులు

కంచరపాలెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయాయని, సామాన్యులు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారని సీపీఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ అన్నారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం దేవేంద్రనగర్ సచివాలయం, 56వ వార్డు గొల్లకంచరపాలెం సచివాలయం ఆవరణలో కంచరపాలెం జోన్ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని కోరారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో కూటమి నాయకులు చర్చించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పూనుకోవాలన్నారు. నాయకులు సానబోయిన సోమేశ్వరరావు, ఎం.ఈశ్వరరావు, ఒమ్మి అప్పారావు, ఒమ్మి విజయ, జి.శ్రీనివాసరావు, కె.కల్యాణి, బి.భవానీ, రాంబాబు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి పూజలు



పార్వతీశ్వరాలయంలో దీప దానాలు చేస్తున్న భక్తులు

సీతంపేట : కార్తీకమాసం, క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా స్థానిక పార్వతీశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి ఉపవాసం అనంతరం ద్వాదశి సందర్భంగా భక్తులు పార్వతీశ్వరుని దర్శించుకుని అభిషేకాలు జరిపించారు. ధ్వజ స్తంభం, జమ్మి, ఉసిరి, రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులకు సాలిగ్రామ, దీప, స్వయంపాక దానాలు చేశారు. సాయంత్రం మేళతాళాలతో 11 రకాల హారతులిచ్చారు. రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. బ్రాహ్మణులకు దీప, సాలిగ్రామ దానాలు చేశారు.

రైతుబజార్‌లో పరిష్మాన్ పండ్లు



రైతుబజార్‌లో విక్రయిస్తున్న పరిష్మాన్ పండ్లు

సీతమ్మధార : మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకున్న పరిష్మాన్ పండ్లు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సీతమ్మధార రైతుబజార్‌కి బుధవారం ఈ పండ్లు తీసుకొచ్చి విక్రయించారు. శీతాకాలంలో మాత్రమే పండే ఈ పండ్లు కిలో రూ.360 వంతున విక్రయిస్తున్నారు. తవ్వవానిపాలెంకి చెందిన రైతు బి.భాగ్యలక్ష్మి తన స్టాల్‌లో పండ్లు విక్రయిస్తున్నారు. ఈ పండ్లతో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు తెలిపారు. ఉత్తర భారతదేశ ప్రజలు మక్కువగా తింటారని తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఆటోల పార్కింగ్‌తో ఇబ్బందులు



చెక్కుడురాయి బిల్డింగ్ వద్ద జగన్నాథపురం గెడ్డపై నిలిపిన ఆటోలు

సీతంపేట : నలుగురూ ప్రయాణించడానికి వీలుగా గెడ్డలపై నిర్మించిన బ్రిడ్జిలపై ఆటోలను పార్కింగ్ చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. జీవీఎంసీ 43వ వార్డు చెక్కుడురాయి బిల్డింగ్ నుంచి జగన్నాథపురం వచ్చే రోడ్‌లో ఉన్న గెడ్డపై ఇటీవల కొత్తగా బ్రిడ్జి నిర్మించారు. ఆ బ్రిడ్జికి రెండు వైపులా ఆటోలు, వ్యాన్‌లు పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మార్గంలో వాహనాలు ప్రయాణించడానికి ఇబ్బంది కలిగేలా బ్రిడ్జిపై రెండు వైపులా ఆటోలు పార్కింగ్ చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. అలాగే చెక్కుడురాయి బిల్డింగ్ నుంచి నరేంద్రనగర్‌కు వెళ్లే మార్గంలో గెడ్డపై ఉన్న బ్రిడ్జిపై కూడా ఇదే పరిస్థితి నెలకొంది. బ్రిడ్జిపై రెండు ఆటోలు, పారిశుధ్య చెత్త సేకరణ బండ్లు నిలిపివేస్తున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో శ్రీలేఖ, చిత్రంలో ఇతర అధికారులు

మహారాణిపేట : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విశాఖపట్నం ఆర్డీవో పి.శ్రీలేఖ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్ డివిజనల్ విజిలెన్స్–మానటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఇతర విభాగాల అధికారులు భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు చేరువ చేయాలని, అన్ని విధాలుగా వారికి అండగా నిలవాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ, దర్యాప్తు విషయంలో జాగ్రత్త వహించాలని, బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. నగర పరిధిలోని ఏసీపీలు, తహసీల్దార్లు, జీవీఎంసీ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే ఉద్యమం ఉధృతం



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సీతమ్మధార: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో బుధవారం జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదేళ్లుగా శానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నారని, వీరికి కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపుమేరకు జీవీఎంసీ పార్కు వద్ద ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కార్మికులకు నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని, ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ని నియమించాలని, వర్కర్లకు మాస్కులు, చీపుర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాజకీయ కక్ష సాధింపులు ఆపాలని, కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు జి.మంగశ్రీ, అధ్యక్షురాలు బంగారమ్మ, సీఐటీయూ నాయకురాలు పి.మణి, ఐటీయూ నాయకులు వసంత, లక్ష్మి, వై.లక్ష్మి, కె.లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.